



యనమలకుదురు ప్రభల సౌరభం

- కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- కృష్ణానది ఘాట్లలో పుణ్యస్నానాలు
- యనమలకుదురులో భక్త సునామీ
- ఆకట్టుకున్న 'ప్రభ'ంజనం

శంభో.. శివ శంభో..

జిల్లా వ్యాప్తంగా భక్తుల శివనామస్మరణ

మహాశివరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. శుక్రవారం వేకువజాము నుంచే భక్తుల పుణ్యస్నానాలతో కృష్ణానదిలోని ఘాట్లన్నీ కిటకిటలాడాయి. 50కిపైగా ప్రభలతో, వేలాది మంది భక్తులతో యనమలకుదురు రామలింగేశ్వర ఆలయ ప్రాంతం భక్త సునామీని తలపించింది. రామలింగేశ్వరస్వామి, పార్వతీదేవి అమ్మవార్ల కల్యాణం వైభవంగా జరిగింది. శివుడి వేషధారణతో కళాకారుల నృత్యప్రదర్శలు ఆకట్టుకున్నాయి. లయబద్ధంగా సాగిన కోయ నృత్యాలూ, హిరాణీ నృత్యాలూ కనువిందు చేశాయి. దక్షిణ కాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లిలో కృష్ణానదిలో పుణ్యస్నానాలకు భక్తులు పోటెత్తారు. బెజవాడ ఇంద్రకీలాద్రిపై శివాలయం భక్తుల శివనామస్మరణతో మారుమోగింది.



పెదకళ్లేపల్లి ఘాట్ వద్ద పుణ్యస్నానం ఆచరిస్తున్న భక్తులు



ఇంద్రకీలాద్రిపై క్యూలో భక్తుల రద్దీ





విద్యుత్ కాంతుల్లో యనమలకుదురు రామలింగేశ్వరాలయం

హామీ

దళితుల శ్మశాన వాటికకు స్థల సేకరణ కోసం మీ ఎమ్మెల్యే కొడాలి నాని నిధులు అడిగారు. రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నాను. కేవలం నెల వ్యవధిలో స్థలాన్ని సేకరించి అప్పగిస్తాం.'

● 2023 జూన్ 16వ తేదీన గుడివాడలో టిడ్కో ఇళ్ల అప్పగింత కార్యక్రమంలో సీఎం జగన్ ఇచ్చిన హామీ ఇది.

ఆచరణ

ఏళ్లు గడుస్తున్నా సీఎం హామీ కార్యరూపం దాల్చడం లేదు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం, స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని నాన్చివేత ధోరణి దళితుల పట్ల శాపంగా మారాయి. నిధులు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నారు.

సీఎం జగన్ హామీ నీటిమూటే

అట్టకెక్కిన దళిత శ్మశానవాటిక నిర్మాణం

చోరవచూపని ఎమ్మెల్యే కొడాలి నాని

టీడీపీ హయాంలో స్థల సేకరణను అడ్డుకున్న వైసీపీ నాయకులు

ఇప్పుడు నిధులు మంజూరు చేయకుండా ప్రభుత్వ నిర్లక్ష్యం



గుడివాడ : గత ప్రభుత్వంలో మల్లాయిపాలెం కల్వరి టెంపుల్ వెనుక ఒక రైతుకు చెందిన 6 ఎకరాల భూమిని అధికారులు గుర్తించారు. అప్పటి వైసీపీ నాయకులు అడ్డుపడి రైతును భయపెట్టి భూమి ఇవ్వకుండా చేశారు. మంజూరైన నిధులకు, రైతు అడుగుతున్న మొత్తాన్ని తీవ్ర వ్యత్యాసం ఉంది. దీంతో రెవెన్యూ అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఇంతలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక హామీ ఇవ్వడమే తప్ప భూమి కేటాయించలేదు.

నమ్మించి మోసం చేసి..

టీడీపీ హయాంలో గుర్తించిన భూమిని కాదని వేరే చోట గుర్తించాలని అధికార పార్టీ నేతలు చెప్పడంతో రెవెన్యూ అధికారులు మళ్లీ భూ పరిశీలన చేపట్టారు. మల్లాయి పాలెం పరిధిలో 5.46 ఎకరాల స్థలాన్ని గుర్తించి భూసేకరణకు అనువుగా ఉందని అంచనాలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించారు. ఆ ఫైల్ అట్టకెక్కింది. ఎటువంటి అనుమతులూ రాలేదు. దళిత సంఘాల నాయకులు పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే నానిని కలిసి తమ గోడును వెళ్లబుచ్చుకున్నా ఫలితం లేకుండాపోయింది. ఏదో ఒకటి చెబుతూ నాని తప్పించుకునే ప్రయత్నాలు చేశారు. రూ.3కోట్లు నిధులు మంజూరయ్యాయని, మరో రూ.2కోట్లు మంజూరైతే వెంటనే భూసేకరణ చేపడతామని చెప్పి దళిత సంఘాల నాయకులను నమ్మించే ప్రయత్నం చేశారు. రెవెన్యూ అధికారులు మాత్రం పైసా నిధులు కూడా మంజూరు కాలేదని స్పష్టం చేస్తున్నారు. మరో వారం రోజుల్లో ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో మరోమారు తాము మోసం పోయామని దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అంచనాలను అధికారులకు పంపాం

దళిత శ్మశానవాటికకు అవసరమైన 5.46 ఎకరాల భూమిని గుర్తించాం. భూసేకరణకు అవసరమయ్యే అంచనాలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు 5 నెలల క్రితమే నివేదికను పంపాం. నేటికీ ఎటువంటి అనుమతులూ రాలేదు. - పి.పద్మావతి, ఆర్డీవో

దళితులకు మొండిచెయ్యి



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి దళితులంటే చిన్నచూపు. భారీ బహిరంగ సభలో దళిత శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయిస్తానని హామీ ఇచ్చి నేరవేర్చలేదు. పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా అంచనాలను పంపామని, ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులూ రాలేదని చెబుతున్నారు. - కంచర్ల సుధాకర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గుడివాడ

ఎమ్మెల్యే మాటలు నమ్మశక్యంగా లేవు



దళిత శ్మశానవాటిక స్థల కేటాయింపుపై పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే నానిని కలిశాం. కొంత మొత్తం మంజూరైందని, మిగిలిన మొత్తం రాగానే శ్మశానవాటిక సమస్య తీరుతుందని చెప్పారు. కానీ అధికారులు మాత్రం పైసా కూడా నిధులు మంజూరు కాలేదని చెబుతున్నారు. ఎమ్మెల్యే నాని చెప్పే మాటలు నమ్మశక్యంగా లేవు. మంజూరు కానీ నిధులు మంజూరయ్యాయని చెప్పడం దళితులను మోసగించడమే.

- పొంగులేటి జయరాజు, మాలల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, గుడివాడ

ముడా సొమ్ముతో మాయాజాలం



పోర్టు భూమి కొనుగోలుకు తెచ్చిన అప్పు ఇష్టారీతిన దారిమళ్లింపు

- ముడా సమావేశంలో తీర్మానం చేస్తేనే నిధుల విడుదలకు అవకాశం
- నిబంధనల ప్రకారమే నడుచుకోవాలని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఆదేశం
- 50 శాతం నిధులు ముందస్తుగా విడుదల చేయాలని ముడా అధికారులపై ఒత్తిడి
- ఎన్నికల ముందు అభివృద్ధి పనులు చేస్తున్నట్టు ఆర్భాటం



ముడా కార్యాలయం

అత్తసొమ్ము అల్లుడు దానం అన్నట్టుంది మచిలీపట్నం వైసీపీ నాయకులు తీరు. మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా)కి చెందిన సొమ్మును నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మళ్లించే ప్రయత్నం చేయడం వివాదాస్పదమవుతోంది. అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు నియోజకవర్గంలో రహదారులు, డ్రెయినేజీలకు కనీస మరమ్మతులు చేయకుండా మిన్నకుండిపోయిన ఎమ్మెల్యే పేర్ని నాని ఎన్నికల సమయంలో ముడా నిధులు రూ.20 కోట్లను దారి మళ్లించే ప్రయత్నం చేయడం చర్చనీయాంశమవుతోంది. పైగా నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం తాను వెళ్లి అడిగితే సీఎం జగన్ రూ.20కోట్ల నిధులు విడుదల చేశారని పేర్ని కిట్టు చెప్పడం గమనార్హం. ఆ నిధులతో రహదారులు, డ్రెయిన్‌లు, వివిధ పనులకు శంకుస్థాపనలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టడం కొసమెరుపు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : టీడీపీ అధికారంలో ఉన్నపుడు బందరుపోర్టు కోసం అవసరమైన భూమిని రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) నుంచి రూ.200 కోట్లను 2018లో రుణంగా తీసుకున్నారు. అప్పట్లో పోర్టుకు అవసరమైన భూసేకరణ, మాస్టర్‌ప్లాన్‌ల తయారీ, భూమి కొనుగోలు తదితర పనులు ముడా ద్వారానే జరిగేవి. దీంతో ఈ నిధులను ముడాకు విడుదల చేశారు. ముడా ద్వారా పోర్టు నిర్మాణం జరిగే ప్రాంతంలోని ఆరు గ్రామాల పరిధిలో ఎకరం రూ.25 లక్షల చొప్పున ధర చెల్లించి రైతుల నుంచి భూమిని కొనుగోలు చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో పోర్టుకు అవసరమైన భూమిని కొనుగోలు చేసే ప్రక్రియను నిలిపివేశారు. ముడాను ఆ బాధ్యతల నుంచి దాదాపు పక్కన పెట్టేశారు. వైసీపీ అధికారం చేపట్టాక ముడా అధికారాలకు కత్తెరపెట్టి అచేతన స్థితిలోకి నెట్టివేశారు. ముడా ద్వారా పోర్టు నిర్మాణం కోసం గతంలో భూమి కొనుగోలు చేయగా, రూ.20కోట్ల నిధులు ముడా వద్ద ఉండిపోయాయి. ఈ నిధులను వేరే అభివృద్ధి పనులు మళ్లించే అవకాశం లేకపోవడంతో ఇంతకాలంగా అలానే ఉంచారు.

● నిధులపై కన్నేసి...

నియోజకవర్గంలో ఐదేళ్లుగా రహదారులు, డ్రెయినేజీల అభివృద్ధి పనులు నామమాత్రంగానే చేశారు. ప్రజలు, ప్రతిపక్ష నాయకులు రహదారుల దుస్థితిపై తమదైన శైలిలో విమర్శలు చేస్తున్నారు. దీంతో ఎన్నికల ముందు అభివృద్ధి పనులు చేసినట్టుగా చూపేందుకు ముడా నిధులను మళ్లించే ప్రయత్నాలు ప్రారంభించారు. ముడా వద్ద ఉన్న రూ.20కోట్లను మచిలీపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి విడుదల చేశారనే ప్రచారం తెరపైకి తెచ్చారు. అనుకున్నదే తడవుగా గతంలో సగం పనులు చేసి నిలిపివేసిన పనులకు కనీస మరమ్మతులు చేస్తున్నామంటూ గతంలో చేసిన పనులకే మళ్లీ కొబ్బరికాయలు కొట్టి ఆర్భాటంగా ప్రారంభిస్తున్నారు. ఉదాహరణకు చిన్నాపురం-కేపీటీపాలెం రహదారి అభివృద్ధి పనులు మూడేళ్ల క్రితమే నిలిచిపోయాయి. ఇటీవల ఈ రహదారి పనులను శంకుస్థాపన చేయడం గమనించదగ్గ అంశం. నియోజకవర్గంలో రహదారుల మరమ్మతుల, డ్రెయినేజీల నిర్మాణం పేరుతో 60కిపైగా పనులను చేస్తున్నట్టుగా చూపి వాటికి మచిలీపట్నం నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి పేర్ని కిట్టుతో శంకుస్థాపనలు చేయించడం గమనార్హం.

● నిబంధనల ప్రకారమే నడుచుకోండి

ముడా నుంచి రూ.20 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని వైసీపీ నాయకులు చెబుతున్నా నిధులు విడుదలలో అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. రాష్ట్ర పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల విభాగం ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మీ ఇటీవల కాలంలో తన తండ్రి పేరుతో నిర్మాణం చేసిన పార్కును ప్రారంభించేందుకు మచిలీపట్నం వచ్చారు. ఈ నేపథ్యంలో ముడా నిధులను మచిలీపట్నంలో చేపట్టే అభివృద్ధి పనులకు మళ్లించాలని ప్రతిపాదన చేసినట్టు సమాచారం. ముఖ్యమంత్రి రూ.20 కోట్ల నిధులను మచిలీపట్నం అభివృద్ధికి అడిగిన వెంటనే మంజూరు చేశారని వైసీపీ నాయకులు చెబుతున్నా, ముడా నిధులను మళ్లిస్తున్నారనే అంశాన్ని బయటకు రానివ్వలేదు. ముడా నిధులను మచిలీపట్నం అభివృద్ధికి కేటాయించాల్సి వస్తే అన్ని నిబంధలను సరిచూసుకుని నిధులు విడుదల చేయాలని రాష్ట్ర పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల విభాగం ప్రత్యేక కార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొనడం గమనార్హం. దీంతో ముడా నిధుల విడుదలకు అవకాశం ఎంతమేర ఉంటుందనే అంశంపై అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన అదేశాలు వెలువడకుండా నిధులు విడుదల చేస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తుతాయని ముడా అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

25 శాతం కాదు, 50శాతం నిధులు విడుదల చేయాలని..

ముడా నుంచి రూ.20 కోట్ల నిధులను విడుదల చేసేందుకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు విడుదల చేస్తే ముందస్తుగా 25 శాతం నిధులను విడుదల చేసేందుకు అవకాశం ఉంటుంది. కానీ 50 శాతం నిధులను విడుదల చేయాలని అధికారులపై కొద్దిరోజులుగా వైసీపీ నాయకుల ఒత్తిడి పెరుగుతోంది. రూ.20 కోట్ల నిధులతో పనులు చేసేందుకు శంకుస్థాపనలు చేయడం తప్ప పనులు చేస్తున్న దాఖలాలు లేవు. దీంతో 50 శాతం నిధులను ఏ పనులు జరిగాయని ఒక్కసారిగా విడుదల చేయాలని, అలా విడుదల చేస్తే తాము ఇబ్బందుల్లో పడతామని ముడా అధికారులు వాపోతున్నారు. ముడా పాలకవర్గం సమావేశమై నిధులను విడుదల చేసే అంశంపై చర్చించి ఈ నిర్ణయాన్ని ప్రభుత్వానికి పంపితే, ఉన్నతాధికారులు అనుమతులు ఇస్తేనే నిధులు విడుదల చేసేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మరో వారం రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉండటంతో నిధులను విడుదల చేసే అంశంపై జిల్లా అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి.

బడ్జెట్ దందా!

దేవదాయశాఖలో బడ్జెట్ కేటాయింపుల కోసం ఈవోల తిప్పలు

- ఆలయాల స్థాయిని బట్టి రూ.10 వేల నుంచి రూ.5 లక్షల వసూలు
- అన్ని స్థాయిల అధికారులకు మామూళ్ల పంట

దేవదాయ శాఖలో కాసుల దందా నడుస్తోంది. ఆర్థిక సంవత్సరం బడ్జెట్ కేటాయింపులను కొందరు ఉన్నతాధికారులు ఎన్‌క్యాష్ చేసుకుంటున్నారు. తమ చేతులు తడిపిన ఈవోల ఫైళ్లు వేగంగా కదులుతున్నాయి. లేకపోతే ఫైళ్లు తిరస్కారానికి గురవుతున్నాయి. ఇందులో ఆలయాన్ని బట్టి రకరకాలుగా 'చెల్లింపులు' జరుగుతున్నాయి. కేవలం బడ్జెట్ ఫైల్ ఓకే చేయడం ద్వారానే ఒక ఉన్నతాధికారి రూ.కోటి వరకు ఆర్జించినట్టు దేవదాయ శాఖలో దుమారం రేగుతోంది.

- 6లో..

అనుభవించు రాజా



హరిత బెర్మ్ పార్కులో ఓ అధికారికి రాచభోగాలు

పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు ఆయనొక ఇల్లరికపు అల్లుడు. రిటైర్ అయిన ఉద్యోగే.. అయినా అతిథ్యానికి అలవాటుపడి బెర్మ్ పార్కులో తిష్ట వేశాడు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎంచక్కా కాటేజీతో పాటు ఫలహారం, ఆహారం, స్నాక్స్, కాఫీల పేరిట రాజభోగాలు అనుభవిస్తున్నాడు. ఏడాదిన్నరగా పర్యాటక కాటేజీలోనే తిష్టవేసిన ఈ అధికారి కారణంగా ఏపీటీడీసీ లక్షల రూపాయల ఆదాయాన్ని కోల్పోతోంది. ఏపీటీడీసీ ఉన్నతాధికారికి ఇష్టుడైన ఈ అధికారి ఇక్కడ ఆడిందే ఆట.. పాడిందే పాట..

- ఏడాదిన్నరగా ఇక్కడే తిష్ట
- కాఫీ, టిఫిన్, స్నాక్స్, లంచ్, డిన్నర్ అన్నీ ఇక్కడే..
- పదవీ విరమణ చేసిన వ్యక్తికి వాటర్ ఫ్లీట్ బాధ్యతలు
- భారీగా నష్టపోతున్న ఏపీటీడీసీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పర్యాటకాభివృద్ధి సంస్థలో చాలాకాలం కిందట పదవీ విరమణ చేసిన ఒక వ్యక్తి ఏడాదిన్నర కిందట మళ్లీ వచ్చాడు. ఉన్నతాధికారితో సన్నిహిత సంబంధం ఉండటంతో ఈ పోస్టులోకి వచ్చినట్టు తెలుస్తోంది. వాటర్ ఫ్లీట్ విభాగాన్ని ఈయన పర్యవేక్షిస్తున్నాడు. వాటర్ ఫ్లీట్ అభివృద్ధికి కృషి చేయాల్సిన ఈ అధికారి పర్యాటక ఆతిథ్యంపై మనసు పారేసుకున్నాడు. హరిత బెర్మ్‌పార్కులో నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. ఏడాదిన్నరగా కాటేజీలోనే ఉంటున్నాడు. ఏసీ సూట్‌లో ఆతిథ్యం, డన్‌లప్ పరుపుపై శయనం, లేవగానే బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం అన్నీ అక్కడే. కోరినపుడు స్నాక్స్, సాఫ్ట్‌డ్రింక్స్. ఇదే సూట్ పర్యాటకులు బుక్ చేసుకుంటే ఏపీటీడీసీకి రోజుకు రూ.2,500 నుంచి రూ.3 వేల ఆదాయం వస్తుంది. మొత్తంగా నెలకు అక్షరాలా రూ.లక్ష ఆదాయం వస్తుంది. కానీ, సదరు అధికారి చెల్లించే మొత్తం మాత్రం రూ.5 వేలు. ఏడాదిన్నరగా ఆయన వల్ల రూ.15 లక్షల నుంచి రూ.18 లక్షల వరకూ ఏపీటీడీసీ ఆదాయాన్ని కోల్పోయింది.

ఇష్టానుసారంగా బోట్ల కొనుగోలు

ఏపీటీడీసీకి ఇల్లరికపు అల్లుడిగా వచ్చిన ఈ అధికారి బోటింగ్ విభాగాన్ని నిర్వీర్యం చేస్తున్నాడు. ఇటీవల ఉత్తర భారతదేశం నుంచి సెకండ్ హ్యాండ్ బోట్లను రహస్యంగా కొనుగోలు చేయటంలో ఈ అధికారి పాత్రే ప్రధానంగా ఉంది. సముద్రంలో ఓడలకు కట్టే బోట్లను రెండింటిని కొన్నారు. వాటిని ఇక్కడ స్పీడ్ బోట్లుగా తిప్పుతారని చెబుతున్నారు. పోర్టు ఎన్‌వోసీలు, ఇరిగేషన్ శాఖ అనుమతులు లేకుండా బోట్లను నడిపిస్తున్న ఈ వాటర్ ఫ్లీట్ బాస్ పర్యాటకుల ప్రాణాలను కూడా ఫణంగా పెడుతున్నాడు. తన అడుగులకు మడుగులొత్తే వారికి ఏపీటీడీసీలో పోస్టింగ్‌లు ఇప్పించుకుంటున్నారు. పదవీ విరమణ చెందిన వారికి కూడా రీ అపాయింట్‌మెంట్లు ఇస్తున్నాడు. ఇలా పోస్టింగ్‌లు తెచ్చుకున్న వారంతా గతంలో పలు ఆరోపణలు ఎదుర్కొన్నవారే.

చర్యలు లేవా?

ఏపీటీడీసీలో సదరు అధికారితో పాటు ఇలాంటి ఎంతోమంది ఉన్నారు. పొరుగు రాష్ట్రం నుంచి వచ్చి ఇక్కడ తిష్టవేసిన వారున్నారు. తిరిగి వెళ్లటానికి ససేమిరా అంటున్నారు. కన్సల్టెంట్ల ముసుగులో లక్షలాది రూపాయలు ఏపీటీడీసీ నుంచి అప్పనంగా తింటున్నారు. ఇలాంటి వారందరినీ మేపుతుండటంతో సంస్థకు అంతులేని భారమవుతోంది.


దుర్గానాగేశ్వరస్వామి


సంగమేశ్వరస్వామి


పంచముఖ అమృత లింగేశ్వర స్వామి


పూల అలంకరణలో మల్లేశ్వరాలయ ముఖద్వారం


ముక్తేశ్వర స్వామి


మల్లేశ్వరునికి నూతన వస్త్రాలు..

హర హర మహాదేవ

మహా శివరాత్రి పర్వదినాన ఉమ్మడి కృష్ణాజిల్లాలో శివాలయాలు శివనామస్మరణతో హోరెత్తాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు. భక్తులతో స్నాన ఘాట్లు కిటకిటలాడాయి. ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు ఎదురుకాకుండా అధికారులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు.

- పెదకళ్లేపల్లిలో పోటెత్తిన శైవాలయాలు
- వేలాదిగా భక్తుల పుణ్యస్నానాలు

మోపిదేవి, మార్చి 8 : పెదకళ్లేపల్లికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉత్తర వాహిని కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు శుక్రవారం తెల్లవారుజాము 4 గంటల నుంచే బారులుతీరారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పితృదేవతలకు పిండ తర్పణలు గావించారు. మహిళలు పసుపు, కుంకుమతో వాయినాలు అందుకున్నారు. కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి పితృదేవతలకు గంగిరెద్దులతో పొగిడించారు. స్నానఘాట్లు కిటకిటలాడాయి. దుర్గానాగేశ్వరస్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు, ఉద్యోగులు క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము 2 గంటల నుంచే భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. దేవస్థానం ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదం, మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ చల్లపల్లి, అవనిగడ్డ సీఐలు నాగ ప్రసాద్, త్రినాథ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు విశేష సేవలు అందించాయి.

శివనామస్మరణతో మార్మోగిన ఐలూరు

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మండలం ఐలూరు శివనామస్మరణతో మార్మోగింది. జిల్లా నలుమూలల నుంచి 80వేల మంది భక్తులు తరలివచ్చారు. కృష్ణానదిపాయలో జల్లు స్నానాలు ఆచరించారు. పితృదేవతలకు పిండప్రదానాలు సమర్పించారు. రామేశ్వరస్వామిని, రఘునాయకస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ రామేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. విఐపీ దర్శనం రూ. 100, విశిష్ట దర్శనం రూ. 10, శీఘ్రదర్శనం రూ.20 ధర నిర్ణయించగా భక్తులను క్యూలైన్‌లో పడిగాపులు పడ్డారు. ఉచిత దర్శనానికి క్యూ లైన్‌లో భక్తులు నరకయాతన అనుభవించారు. కృష్ణానదిపాయ వద్ద సుమారు 4 వేలమంది భక్తులు స్నానాలు ఆచరించి శ్రీమద్ భ్రమరాంబ చెన్నమల్లిఖార్జునస్వామిని దర్శించుకున్నారు.

భోళా శంకరుడికి త్రికాల అర్చనలు

వన్‌టౌన్ : మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని వన్‌టౌన్ శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భోళాశంకరుడికి క్షైమోద్భులు సమర్పించారు. హరోం హర సాంబ సదాశివ అంటూ భక్తజనం అర్చనలలో పాల్గొన్నారు. వేకువ జామునుంచే అభిషేకాలు ప్రారంభమయ్యాయి.

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో..

ఇంద్రకీలాద్రి మల్లేశ్వరాలయంలో స్వామివారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దుర్గమ్మవారిని, మల్లేశ్వరస్వామిని ప్రధాన ప్రభుత్వ కార్యదర్శి కేఎస్ జవహర రెడ్డి దర్శించుకున్నారు. ఈవో రామారావు ఆయనకు సాదర స్వాగతం పలికారు. భక్తులు ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు.

మంగళగిరి భక్త మార్కండేయ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేనేత మగ్గాలపై వారం రోజుల పాటు ప్రత్యేకంగా నేసిన పట్టువస్త్రాలను స్వామివారికి సమర్పించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ మల్లేశ్వరస్వామికి అభిషేకాదులను నిర్వహించి శ్వేత పట్టు వస్త్రాలను సమర్పించారు.

ఘాట్ల వద్ద భక్తుల స్నానాలు..

ఘాట్లలో నీరు లేకపోవడంతో అధికారులు జల్లు స్నానాలు ఏర్పాటు చేశారు. భక్తులు కాస్త ఇబ్బందులకు గురయ్యారు. పాత శివాలయంగా పేరున్న భ్రమరాంబ మల్లేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు.

కూడలి సంగమేశ్వరాలయంలో..

నందిగామ రూరల్ : దాములూరు కూడలి గ్రామంలో సంగమేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవ తిరునాళ్లలో భాగంగా తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈవో వాసిరెడ్డి భూపాల్, చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సంగమం ప్రాంతంలో భక్తులు జల్లుస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సంగమతీరాన పితృదేవతలకు తర్పణ పూజలు చేశారు. వాసవీ క్లబ్ సభ్యులు భక్తులకు మంచి నీరు, మజ్జిగ పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌లు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. సీఐ హనీష్ పర్యవేక్షణలో ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు. అంబారుపేట, పల్లగిరి గట్టు, నందిగామ గ్రామాలలో ఓంకారేశ్వర స్వామి, రాఘవాపురం కోటరాయగుట్టపై మల్లేశ్వరస్వామి ఆలయాలలో రుద్రాభిషేకం, పుష్పార్చన కార్యక్రమాలను నిర్వహించారు. గోళ్లమూడి, సోమవరం, పల్లగిరి, దాములూరు గ్రామాలలోని శివాలయాలలో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు.

కమనీయం.. గంగా, పార్వతి, మల్లేశ్వరుల కల్యాణం



వన్‌టౌన్, మార్చి 8 : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలను నిర్వహించారు. భక్తులు హరోం హర అంటూ నినాదాలు చేశారు. సంప్రదాయం మేరకు లింగోద్భవం అనంతరం గంగా, పార్వతి, మల్లేశ్వరుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మూడురోజుల క్రితం అమ్మవారు. స్వామివార్ల ఉత్సవమూర్తులను వధూవరులుగా అలంకరించారు. అప్పటి నుంచి వివిధ హోమాలు మూలమంత్ర హవనాలు మండపూజలు నిర్వహించారు. శివరాత్రి కల్యాణోత్సవం సందర్భంగా పార్వతీదేవి, మల్లేశ్వరుల వంశ శోభితాన్ని వర్ణిస్తూ పండితులు ఎదురుకోల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదే సమయంలో పాతశివాలయంలోనూ లింగోద్భవం అనంతరం భద్రకాళి, వీరభద్రస్వామి, భ్రమరాంబా మల్లేశ్వరుల కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు.

శివ భక్తులతో పోటెత్తిన ముక్త్యాల..

జగ్గయ్యపేట రూరల్ : ముక్త్యాల గ్రామం శుక్రవారం భక్తులతో పోటెత్తింది. తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. భవానీ ముక్తేశ్వరస్వామికి అర్చకులు విశేషపూజలు నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈవో జయప్రకాష్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించగా వంశపారంపర్య ధర్మకర్త వెలగపూడి లక్ష్మణ ఇందిరాదత్ కేసీపీ సౌజన్యంతో భక్తులకు ప్రసాదం, తాగునీటిని పంపిణీ చేశారు.

కోటిలింగాల క్షేత్రంలో..

ముక్త్యాల సమీపంలో కామాక్షి సమేత పంచముఖ అమృతలింగేశ్వర స్వామి ఆలయంలో విశేషపూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో బొగ్గవరపు రవీంద్ర బాబు అన్ని ఏర్పాట్లు చేశారు.

కమనీయం రామలింగేశ్వరుని కళ్యాణం

నలభైకి పైగా ప్రభల ఏర్పాటు

పెనమలూరు : యనమలకుదురు రామలింగేశ్వర స్వామి, పార్వతీదేవి అమ్మవార్ల కళ్యాణం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. వేలమంది భక్తులు హాజరయ్యారు. తెల్లవారు జాము నుంచే స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉదయం 11గంటలకు గ్రామ మంటపం వద్ద దేవస్థాన ప్రభకు ఎడ్లు కట్టి ఊరేగించడానికి వేలం పాట నిర్వహించారు. రాధాకృష్ణ కోలాటాలు, భజనలు, కోయ నృత్యాలు, భేతాళ వేషాలు, హిరాణీ నృత్యాలు, మేళతాళాలతో గ్రామ ప్రభను అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. నేడు స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో గంగాధర్ తెలిపారు.

ప్రభలకు రూ.2.5 లక్షల విరాళం

ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన 24 ప్రభలకు గ్రామ టీడీపీ నాయకులు అనంతనేని చంద్రశేఖర్ ఆజాద్ రూ.2.5లక్షలను మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులకు టీడీపీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకర బాబు, మొక్కపాటి శ్రీనివాస్‌లు ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసుశాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది.


పితృదేవతలకు పిండ ప్రదానాలు


సీతానగరం వద్ద కృష్ణానదిలో భక్తుల స్నానాలు


ముక్త్యాల వద్ద భక్తుల పుణ్యస్నానాలు


తోట్లవల్లూరు మండలం ఐలూరులో జల్లు స్నానాలు


కూడలి సంగమేశ్వరాలయం వద్ద ..


కళాకారుల నాట్యాభినయం

రామలింగేశ్వరునికి నృత్య నీరాజనం

కూచిపూడి : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత పసుమర్తి రామలింగశాస్త్రి పర్యవేక్షణలో కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర నాట్య కళావేదికపై శుక్రవారం సాయంత్రం కళాకారులు నాట్యాంశాలు ప్రదర్శించి రామలింగేశ్వరునికి నాట్య నీరాజనాలు అందించారు. నాట్య ప్రదర్శనలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. మహాశివరాత్రి రోజున జాగారం చేసి భక్తిపాటలు ఆలపించటం ఆనయవాతీగా వస్తోంది. బాలత్రిపుర సుందరిదేవి పాలకమండలి, నాట్యాచార్యులు, గ్రామస్థులు తమ సహకారం అందించారు.

టీడీపీ, జనసేన విజయాన్ని ఎవరూ ఆపలేరు

- పేర్ని నానికి రాజకీయ సన్యాసం తప్పదు
- టీడీపీ, జనసేన శంఖారావ సభలో రవీంద్ర, కొనకళ్ల, బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, మార్చి 8 : రాష్ట్రంలో టీడీపీ, జనసేన జెండా ఎగురవేయడం ఖాయమని, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి, మాజీమంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు అన్నారు. మచిలీపట్నంలో శుక్రవారం రాత్రి జరిగిన నియోజకవర్గ సమర శంఖారావసభలో రవీంద్ర మాట్లాడారు. తొలుత మూడు స్తంభాల సెంటర్ నుంచి 4 గంటలకు ప్రారంభమైన ర్యాలీ ఎస్పీ బంగ్లా నుంచి రూటు మార్చారు. పేర్ని నాని ఇంటి మీదుగా వెళ్లకుండా రూటు మార్చడంతో కొద్దిసేపు పోలీసులకు, జనసేన, టీడీపీ కార్యకర్తలకు వాగ్వివాదం జరిగింది. అనంతరం జరిగిన శంఖారావ సభలో రవీంద్ర మాట్లాడారు. రాజధాని అమరావతిని సమర్థించి జగన్‌రెడ్డి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాడన్నారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకుంటున్నారన్నారు. జనసేన నేత బండి రామకృష్ణ మాట్లాడుతూ, టీడీపీ, జనసేన పొత్తుతో వైసీపీ నాయకులకు వణుకు పుడుతోందన్నారు. కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, మచిలీపట్నంలో నాలుగున్నర గంటల సేపు జరిగిన ర్యాలీకి అపూర్వ స్పందన లభించిందన్నారు. ఎన్నికల వరకు ఇదే స్ఫూర్తితో పనిచేసి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ను అధికారంలోకి తీసుకుని వచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కొనకళ్ల బుల్లయ్య, గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, మోటమర్రి బాబా ప్రసాద్, పంచపర్వాల కాశీవిశ్వనాథం, కాగిత వెంకటేశ్వరరావు, లంకే నారాయణ ప్రసాద్, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, కుంచే నాని, బత్తిన దాసు, లంకిశెట్టి నీరజ, మరకాని సమతాకీర్తి, చిన్నాపురం లంకిశెట్టి నీరజ తదితరులు పాల్గొన్నారు.


సభలో ప్రసంగిస్తున్న కొల్లు రవీంద్ర

దేవదాయశాఖలో.. బడ్జెట్ దందా!



- బడ్జెట్ కేటాయింపుల కోసం ఈవోల తిప్పలు
- ఆలయాల స్థాయిని బట్టి రూ.10 వేల నుంచి 5 లక్షలు వసూలు
- అన్ని స్థాయిల అధికారులకు మామూళ్ల పంట

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

ఆర్థిక సంవత్సరం మారుతుందంటే దేవదాయశాఖలో కొందరు అధికారులకు కాసుల వర్షం కురుస్తుంది. ప్రతియేటా ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో శాఖ పరిధిలోని ఆలయాలు, సత్రాలు బడ్జెట్ కేటాయింపులు చేయించుకోవాల్సి ఉంటుంది. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ కేటాయింపులు ప్రస్తుతం నడుస్తున్నాయి. బడ్జెట్ కేటాయింపులకు కొందరు ఉన్నతాధికారులు వసూళ్ల దందాకు తెరలేపారు. ఆలయాలు, సత్రాల స్థాయిని బట్టి రూ.10 వేల నుంచి సుమారు రూ.5 లక్షల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. అడిగిన మేరకు డబ్బు ఇవ్వని కార్యనిర్వాహక అధికారుల(ఈవో)ను ఇబ్బందులకు గురిచేస్తూ పలు కారణాలతో ఫైళ్లను తిరస్కరిస్తున్నట్టు పలువురు కార్యనిర్వాహక అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆలయాల స్థాయిని బట్టి అధికారి

దేవదాయశాఖ కమిషనర్ పరిధిలో కోటి రూపాయలు, ఆపైన ఆదాయం ఉన్న ఆలయాలు, సత్రాలు ఉంటాయి. ఇలాంటివి రాష్ట్రవ్యాప్తంగా 300 నుంచి 400 వరకు ఉన్నాయి. రీజనల్ జాయింట్ కమిషనర్ (ఆర్‌జేసీ) పరిధిలో శ్రీకాకుళం నుంచి కృష్ణాజిల్లా వరకు రూ.కోటిపైన ఆదాయం ఉన్న ఆలయాలు, సత్రాలు ఉంటాయి. ఇలాంటివి 100 వరకు ఆర్‌జేసీ పరిధిలో ఉన్నాయి. డిప్యూటీ కమిషనర్ స్థాయిలో ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఏడాదికి రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షల మేరకు ఆదాయం వచ్చే ఆలయాలు, సత్రాలు ఉంటాయి. ఇలాంటివి సుమారు 500కు పైగా ఉన్నాయి. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) పరిధిలో ఏడాదికి రెండు లక్షల రూపాయల వరకు ఆదాయం వచ్చే ఆలయాలు, సత్రాలు సుమారు వెయ్యి వరకు ఉంటాయి.

బడ్జెట్‌తో కాసుల పంట

ఆయా ఆలయాలు, సత్రాలకు సంబంధిత అధికారులు ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 2024-2025 ఆర్థిక సంవత్సరానికిగాను బడ్జెట్‌ను కేటాయించాల్సి ఉంటుంది. బడ్జెట్ కేటాయింపులో ఆలయాలు, సత్రాల స్థాయిని బట్టి సంబంధిత అధికారులు రూ. 10 వేలు నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నట్టు ఈవోలు ఆరోపిస్తున్నాయి. జీతాలకే డబ్బులు సరిపోని ఆలయాల నుంచి కూడా ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారని వారు వాపోతున్నారు. ఆర్‌జేసీ లేనందున డీసీకి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయనపై ఏసీబీ కేసు నడుస్తోంది. కేసు పెండింగ్‌లో ఉన్నందున బడ్జెట్ శాంక్షన్స్‌తోపాటు ఆర్థికపరమైన లావాదేవీలు ఏవీ ఆయన జరపకూడదని నిబంధనలు ఉన్నా బడ్జెట్ కేటాయింపులు ఆయన చేతుల మీదుగా జరిగిపోతున్నాయి. పైస్థాయి అధికారులు, పలువురు మంత్రుల అండదండలు ఉండటంతో దేవదాయశాఖలో ఆయన చెప్పిందే వేదంగా నడుస్తోందని పలువురు ఉద్యోగులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఆయన తర్వాత స్థాయిలో విధులు నిర్వహించే అధికారిపై కూడా బడ్జెట్ దందా ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన పరిధిలోని ఆలయాల బడ్జెట్ ఆమోదానికి కాసులు లేనిదే సంతకం పెట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. తనిఖీల పేరిట ఆలయాలు, సత్రాలకు వెళ్లినపుడు పట్టు వస్త్రాలు, రూ.10వేల వేల నగదు సమర్పించుకుంటేనే అన్ని సక్రమంగా ఉన్నట్టు సంతకం చేస్తారని దేవదాయశాఖ సిబ్బంది చెబుతున్నారు. అధికారపార్టీలోని ఓ కీలక నాయకుడు అండతో ఈ అధికారి ఎవ్వరినీ లెక్కచేయరన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్క బడ్జెట్ ఆమోదం ద్వారానే సుమారు రూ.కోటి వరకు ఈ అధికారి ఆర్జించారన్న ప్రచారం నడుస్తోంది.

జ్యుడీషియల్ రిమాండ్ ఖైదీ మృతి



విజయవాడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని జిల్లా కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. విజయవాడ కొత్తపేట గొల్లగుంటవాగు ప్రాంతానికి చెందిన బాలగంగాధర్ తిలక్(37)ను వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు సితార సెంటర్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుకుని గురువారం కోర్టులో హాజరుపరిచారు. తిలక్‌కు న్యాయాధికారి రూ.10 వేల జరిమానాతోపాటు జైలుశిక్ష విధించారు. పోలీసులు అదేరోజు సాయంత్రం జైలుకు తరలించారు. శుక్రవారం ఉదయం తిలక్ వాంతులు చేసుకుని, కింద పడిపోయాడు. వెంటనే స్పందించిన జైలు సిబ్బంది అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికి తిలక్ ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. తిలక్ కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నట్టు కుటుంబసభ్యులు చెబుతున్నారు. అతడికి కామెర్ల వ్యాధి ఉన్నట్టు తెలిసింది. తమ కుమారుడికి పోస్టుమార్టం చేయవద్దని తల్లిదండ్రులు పట్టుబట్టారు. సీపీఎం కార్పొరేటర్ బోయి సత్తిబాబు మార్చురీ వద్ద ఆందోళన చేశారు. మృతుడి కుటుంబానికి రూ.50లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబసభ్యులతో ఆర్డీవో భవానీశంకర్ మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. దీనిపై గవర్నరుపేట పోలీసులు కేసు నమోదు చేశారు.


వరల్డ్ రికార్డ్ కోసం పాడుతున్న రుగ్వేదం పద్మశ్రీ

నాన్‌స్టాప్‌గా 4 గంటలు

- యువగాయని రుగ్వేదం పద్మశ్రీ రికార్డు

విజయవాడ కల్చరల్, మార్చి 8 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్వరలయ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ యువగాయని రుగ్వేదం పద్మశ్రీ నాన్‌స్టాప్‌గా 116 మంది తెలుగు సినీ నేపథ్య గాయనీమణులు ఆలపించిన గీతాలను ఏకగళంతో ఆలపించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం సాయంత్రం 4 గంటల పాటు గాయని పద్మశ్రీ తన మధుర గాత్రంతో శ్రోతలను అలరిస్తూ ఈ రికార్డు సాధించింది. హైగ్రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, చాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌ల ప్రతినిధులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో ఈ రికార్డులు ఆమెకు అందించి సత్కరించనున్నట్టు పేర్కొన్నారు. విదేశాల్లోను కూడా తెలుగు పాటలను వినిపించి కీర్తి గడించిన ఈ యువ గాయని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతోంది. ప్రముఖ సంగీత విద్వాంసులు ఎన్‌సీహెచ్ బుచ్చయాచార్యులు వద్ద కర్ణాటక సంగీతంలో మెళకువలపై సాధన చేస్తోంది. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వై.సుబ్రమణ్యం, కార్యదర్శి ఎస్ఆర్ ప్రభాకర్, మోహన్‌రాంప్రసాద్‌లు పాల్గొన్నారు.

పోలాటితిప్ప మడ అడవుల్లో విస్తృతంగా నాటుసారా

1700లీ. బెల్లపు ఊట, 30 లీ. సారా ధ్వంసం

మచిలీపట్నం టౌన్ : మండలంలో పోలాటితిప్ప గ్రామంలోని మడ అడవుల్లో నాటుసారా స్థావరాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం విస్తృత దాడులు చేశారు. 1700 లీటర్ల బెల్లపు ఊట, 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. సారా తయారు చేసినా, అమ్మినా చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని మచిలీపట్నం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ జి. సత్యనారాయణ తెలిపారు.



గన్నవరంలో నాలుగు దుకాణాల్లో చోరీ

గన్నవరం, మార్చి 8 : దొంగలు గురువారం అర్ధరాత్రి గన్నవరంలో హల్‌చల్ చేశారు. దావాజీగూడెం రోడ్డులో మూడు షాపుల్లో, బస్టాండ్ సమీపంలోని రెస్టారెంట్‌లో దొంగతనాలకు పాల్పడ్డారు. పలు షాపుల్లో సీసీ కెమేరాలు ఉండటంతో వాటికి చిక్కారు. క్వాలిటీ చికెన్ షాపు, ఎదురుగా ఉన్న పాలబూత్, దాని పక్కనే ఉన్న జ్యూస్, ఐస్ క్రీమ్‌షాపులో నలుగురు వ్యక్తులు తాళాలు పగులకొట్టి లోపలకి వెళ్లారు. ఆయా షాపుల్లో నగదు కొంచం మాత్రమే ఉండటంతో యజమానులు ఊపిరిపీల్చుకున్నారు. క్రైమ్ పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సీసీ కెమేరాల ఫుటేజ్‌ని పరిశీలించారు. విజయవాడకు చెందిన యువకులు దొంగతనానికి పాల్పడి నట్లు గుర్తించారు. వీరిలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు సీఐ ప్రసాద్ తెలిపారు.

సమాధుల స్థలంలో ఆక్రమణలు తొలగించాలి



ఉయ్యూరులో దీక్ష చేస్తున్న క్రైస్తవులు

ఉయ్యూరు, మార్చి 8 : ఉయ్యూరు ఒకటవ వార్డు గురజాడ డొంక ప్రాంతంలో క్రైస్తవ సమాధుల స్థలంలో ఆక్రమణలు తొలగించాలని కోరుతూ క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సీబీఎం చర్చి సమీపాన క్రైస్తవులు నిరసన దీక్ష చేపట్టారు. సమాధుల స్థలంలో ఆక్రమణలు తొలగించాలని క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో అధికారులకు లిఖిత పూర్వకంగా తెలియపరచినా పట్టించుకోపోవడంతో దీక్ష చేపట్టామని సంఘ నాయకులు తెలిపారు. క్రైస్తవ సమాధులకు సరిపడ స్థలం లేకపోగా ఉన్న స్థలాన్ని అధికార పార్టీ నేత సహకారంతో ఆక్రమణకు గురైందని ఆరోపించారు. ఆక్రమణలు తొలగించి స్థలం అప్పగించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సంఘ నాయకులు హెచ్చరించారు. చంటిబాబు, విజయబాబు, పుల్లయ్య, పలువురు మహిళలు పాల్గొన్నారు.

దేవరమ్మతల్లి మహోత్సవం

చినఓగిరాల(ఉయ్యూరు), మార్చి 8 : చినఓగిరాలలో పాలడుగు వారి దేవరమ్మతల్లి పూజా మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజాది కార్యక్రమాలు జరిపించారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అన్నసంతర్పణ

పెనమలూరు, మార్చి 8 : పోరంకిలోని నవరత్నమ్మ అనాథ శరణాలయంలో శుక్రవారం శివరాత్రి సందర్భంగా అనాథలకు అన్నసంతర్పణ గావించారు. తాడిగడప గ్రీన్ సిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

మార్మోగిన శివ నామస్మరణ

- వేకువజామునుంచే శివయ్య దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు
- మద్దూరులోని ఎన్టీఆర్ పుష్కరఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు




మద్దూరు ఎన్టీఆర్ పుష్కర ఘాట్‌లో శివలింగం వద్ద పూజలు చేస్తున్న భక్తులు, ఉయ్యూరు సోమేశ్వరస్వామి ఆలయంలో..

కంకిపాడు, మార్చి 8 : మహాశివరాత్రి పురస్కరించుకుని మండల పరిధి గ్రామాల్లో శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. మద్దూరులోని ఎన్టీఆర్ పుష్కర్ ఘాట్‌లోని కృష్ణానదీ తీరంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. పెద్దలకు పిండ ప్రదానం అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఏర్పాట్లను కంకిపాడు మాజీ జెడ్పీటీసీ గొంది శివరామకృష్ణ ప్రసాద్, యనమదల వెంకటేశ్వరరావు, మదన్ మోహన్, వాసు, తీట్ల మధు తదితరులు పర్యవేక్షించారు. ప్రొద్దుటూరు శివాలయంలో ఆలయ అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంకిపాడు, ఈడుపుగల్లు, ఉప్పలూరు, గొడవర్రు, ప్రొద్దుటూరు శివారు గాయత్రి విహార్‌లో శివాలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివాలయాలు కిటకిట

ఉయ్యూరు : మహాశివరాత్రి పురస్కరించుకుని శుక్రవారం ఉయ్యూరు, మండల పరిధి గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. వేకువజాము నుంచి తరలివచ్చిన భక్తుల ఓంనమః శివాయ, హర హర మహాదేవ నామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. సోమేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉండగా స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయ ప్రాంగణంలో క్యూలో నిలుచున్నారు. భక్తులకు ఎండ తాకిడి లేకుండా ఆలయ పాలక మండలి చైర్మన్ కుటుంబ రాజు, ఇతర సభ్యులు టెంట్‌లు వేసి అసౌకర్యం కలగాకుండా చర్యలు చేపట్టారు. చినఓగిరాల, కాటూరు, పెద ఓగిరాల, ముదునూరు, కలువపాముల, శాయిపురం, ఆకునూరు గ్రామాల శివాలయాలకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

ముస్తాబాదలో యార్లగడ్డ ప్రత్యేక పూజలు

గన్నవరం : మహా శివరాత్రి మహోత్సవాన్ని మండలంలో భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అభిషేకాలు, కుంకుమార్చనలు, విశేష పూజలు జరిగాయి. ముస్తాబాద రామలింగేశ్వర స్వామి గుహాలయంలో టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక పూజలు చేశారు. చిక్కవరం కొండపై ఉన్న బ్రహ్మయ్య లింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు జరిగాయి. స్వామివారికి గన్నవరం పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు అందజేశారు. ఆలయ ధర్మకర్త, గ్రామ సర్పంచ్ అన్నే లక్ష్మణరావు (నల్లబాబు) ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు అన్నసమారాధన చేశారు. స్థానిక కోనాయి చెరువు సమీపంలోని విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆది దంపతులకు కల్యాణ నిర్వహించారు. 10 వేల మందికి అన్నసంతర్పణ చేశారు.

బాపులపాడు మండలంలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బాపులపాడు మండలంలోని శివాలయాలు ప్రత్యేక అలంకరణలతో వెలుగులీనాయి. శుక్రవారం తెల్లవారు ఝామునుంచి శివయ్య దర్శనం కోసం అభిషేక పూజల్లో పాల్గొనేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పెరికీడులోని ముక్తేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు కుందుర్తి సీతారామయ్య, శ్యామ్‌ల పర్యవేక్షణలో విశేష పూజలు నిర్వహించారు. కానుమోలులోని పురాతన శివాలయంలో తెల్లవారుఝామునుంచి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. వీరవల్లిలోని కొండేశ్వరస్వామికి అర్చకులు ప్రత్యేక అభిషేక పూజలనంతరం ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. సింగన్నగూడెం, కొత్తపల్లి ఆశ్రమం, సిరివాడ, మల్లవల్లి తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తుల శివ నామస్మరణతో మార్మోగాయి.



పెరికీడు ముక్తేశ్వరస్వామి ఆలయంలో..



నెప్పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బోడె హేమ, పార్టీ నాయకులు

ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి హేమ

నెప్పల్లి (కంకిపాడు), మార్చి 8 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాల్సిన అవసరముందని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి హేమ అన్నారు. మండలంలోని నెప్పల్లిలో శుక్రవారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పార్టీ నాయకులు కొలుసు గోవిందరావు,రాజేశ్వరి, ఈడుపుగంటి కిరణ్, సుదిమళ్ల రవీంద్ర, వణుకూరు విక్రం, సెంగెపు రంగారావు, కోలవెన్ను గోపిచంద్, గఫార్, కోల వెన్ను శివరామ్, ఈడుపుగంటి నాని, కొలుసు ప్రసన్న, పుష్ప, కె.శివ, జనసేన పార్టీ నాయకులు జోజి, సాయి పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి బీసీ డిక్లరేషన్: ఆరుమళ్ల



ఇందుపల్లిలో ఎన్టీఆర్, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం

ఉంగుటూరు, మార్చి 8 : టీడీపీ, జనసేన సంయుక్తంగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లోని 10అంశాలు బీసీల అభ్యున్నతి, ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయని టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. బీసీ డిక్లరేషన్ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ పార్టీ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఇందుపల్లిలో గ్రామ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు అరికట్ల రవి, నూతక్కి బెనర్జీ, ఇందుపల్లి యోహాను, దాసరి రంగారావు, రాచకొండ శ్రీను, కోలవెంటి నాగబాబు, రాజకుమార్, గుండపనేని నాని, గోగినేని విష్ణువర్ధన్‌రావు, పోతినేని రామకృష్ణ, వివేక్, భరత్ పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి కృషి చేయాలి

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పలువురు మహిళా నేతలు



పోరంకి టీడీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవ కేకును కోస్తున్న బోడె వైష్ణవి, యార్లగడ్డ సుచిత్ర

పెనమలూరు, మార్చి 8 : మహిళా అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలని పలువురు మహిళా నేతలు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మండలంలో ఘనంగా నిర్వహించారు. కానూరు, పోరంకి, తాడిగడప, యనమలకుదురుల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల సాధికారత సభలు నిర్వహించారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవంలో మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయ వైష్ణవి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, పార్టీ మహిళా నేతలు మేడసాని రత్నకుమారి, మన్నెం నాగలక్ష్మి, రేపాకుల నాగలక్ష్మి, బొప్పన లావణ్య, గట్టు వాణి, అన్నవరపు శివపార్వతి, దోనేపూడి రమాదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ..



ఉయ్యూరులో..

ఉయ్యూరు : ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నాగళ్ల రాజేశ్వరమ్మ జానకీరామయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉయ్యూరు నగర పంచాయతీ పారిశుధ్య కార్మికురాలు డి కనకదుర్గమ్మ, ఉచిత కుట్టుశిక్షణ ద్వారా పలువురు మహిళలకు స్వయం ఉపాధికి సహాయపడుతున్న కె స్వర్ణలతను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు నర్రా సుధారాణి, అన్నే రాణి, మాధురి, సూర్యకుమారి, ఉషారాణి, రూప, ఐద్వా జిల్లా కార్యదర్శి జ్యోతి, మండల కన్వీనర్ కీర్తి కుట్టులో శిక్షణ పొందుతున్న మహిళలు, యువతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాధికారత సాధించాలి

హనుమాన్‌జంక్షన్ : మహిళలు ఆర్థిక సాధికారత సాధించినపుడే సమాజం అభివృద్ధి చెందుతుందని మానవత సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో అంతర్జాతీయ దినోత్సవ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవత నిర్వాహకులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, వడ్డి రాజేశ్వరరావు, కొట్నాని రామ చంద్రరావు, దయాల ప్రభాకర్, వేగిరెడ్డి సూర్యనారాయణ, బాణాల నరసింహారావు, పీవీఎస్.చలం, అక్కినేని రాఘవేంద్రరావు, కెఎస్‌ఎస్. ముఖర్జి పాల్గొన్నారు. ఆదిత్య బధిర పాఠశాలలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు.

కోడూరుపాడులో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ఆడపిల్లకు ఆస్తిలో హక్కు కల్పించి, రాజకీయాల్లో రిజర్వేషన్ల ద్వారా ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత టీడీపీదేనని తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు గరికపాటి నాగలక్ష్మి అన్నారు. కోడూరుపాడు టీడీపీ, జనసేన కమిటీ ఆధ్వర్యంలో బీసీ మహిళలకు మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో పార్టీ నాయకులు కొండపల్లి వెంకన్న, ఊసా హేమంతరావు, కాటూరి దుర్గారావు, మండేపూడి రామ కృష్ణ, చందు రాంబాబు, సలాది సాంబయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంభన సాధించాలి

గన్నవరం : మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించినప్పుడే ఆ కుటుంబాలు ఉన్నతంగా ఉంటాయని, అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ అన్నారు. స్థానిక రాయనగర్ కళ్యాణ మండపంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ అధ్యక్షతన జరిగిన సభలో ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కరుణ, సీడీపీవో వెంకటలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, ఉంగుటూరు ఎంపీపీ వడ్లమూడి సరోజిని, సర్పంచ్ నిడమర్తి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యానికి సోషల్ మీడియా దోహదం

టీడీపీ గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు



ఐ టీడీపీ కార్యకర్తలకు టేబుల్ స్టాండ్ సైకిళ్లు అందజేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

గుణదల, మార్చి 8 : సామాన్య ప్రజల్లో మరింత చైతన్యం తీసుకొచ్చేందుకు సోషల్ మీడియా ఎంతో ఉపయుక్తంగా ఉందని యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. టీడీపీ యాప్ సోషల్ మీడియా ద్వారా 1.50 లక్షల పాయింట్లు సాధించిన నలుగురికి సన్మానం చేసి తగిన గుర్తింపు ఇచ్చే కార్యక్రమం ఎనికే పాడులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. కార్యక్రమానికి హాజరైన యార్లగడ్డ వెంకట్రావు ప్రజల శ్రేయస్సు కోసం పార్టీ ప్రతిష్ట కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వారిని అభినందించారు. ఐ టీడీపీ ఆధ్వర్యంలో ఇటువంటి వారికి గుర్తింపు ఇవ్వడం పార్టీ ప్రథమ కర్తవ్యంగా భావిస్తుందని తెలిపారు. టీడీపీ యాప్ సోషల్ మీడియా ద్వారా 1.50 లక్షల పాయింట్లు సాధించడం సామాన్య విషయం కాదని అలా అధిక పాయింట్లు సాధించిన నలుగురికి టేబుల్ స్టాండ్ సైకిళ్లు అందజేసి అభినందనలు తెలిపారు. విజేతలు మెట్ట రాజేష్ కిరణ్, ఎనమందల సాయి పవన్ చౌదరి, చిట్టూరి వెంకట్, బుస్సే సరిత దేవిలకు బహుమతులు అందజేశారు.

తానా కార్యదర్శి రాజా సేవలు మరువలేనివి: ఆళ్ల



రాజాని సత్కరిస్తున్న ఆళ్ల

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 8 : గ్రామీణప్రాంత రైతు కుటుంబం నుంచి తానా కార్యదర్శిగా సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విదేశాల్లోని తెలుగు వారికి అండగా నిలబడుతూ కసుకుర్తి రాజా అందిస్తున్న సేవలు మరువలేనివని ఆర్‌ఆర్‌డీఎస్ కార్యదర్శి ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. రంగన్నగూడెం కమ్యూనిటీహాల్‌లో ఆర్‌ఆర్‌డీఎస్ ఆధ్వర్యంలో కసుకుర్తి రాజాకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఉభయ తెలుగురాష్ట్రాల్లో తానా చైతన్య స్రవంతి కార్యక్రమం ద్వారా కంటి వైద్య శిబిరాలు, విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడంతో పాటు రైతులకు వ్యవసాయ రక్షణకిట్లను చేయడం లాంటి సేవలందించారన్నారు. కార్యక్రమంలో మహిళా దినోత్సవం సందర్భంగా సర్పంచ్ కసుకుర్తి రంగా మణిని ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల దశరథరామయ్య, పుసులూరి లక్ష్మీనారాయణ, మొవ్వా శ్రీనివాసరావు, దోనవల్లి హరి, నరసింహారావు, మొక్కపాటి సత్యనా రాయణ, మొవ్వా వేణుగోపాల్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.63

వైసీపీ పాలనలో గ్రామాభివృద్ధి శూన్యం : కుమార్ రాజా

కూచిపూడి : వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్ రాజా విమర్శించారు. పల్లెబాట కార్యక్రమం శుక్రవారం నాటికి నాల్గో రోజుకు చేరుకుంది. పెద ముత్తేవి, కొండవరం గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేయటంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మహిళల అభ్యున్నతికి టీడీపీ, జనసేన ప్రభుత్వం అనేక పథకాలు రూపకల్పన చేసిందన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు నన్నపనేని వీరేంద్ర, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వర రావు, వీరంకి తులసీదాస్, ఉప్పలపాటి నాగలక్ష్మి ప్రసన్న, పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నాగులేటి వద్ద నీళ్లు తక్కువగా ఉండడంతో అడ్డుకట్ట, భక్తుల పుణ్యస్నానాలు



గుడ్లవల్లేరులో రుద్రాక్ష లింగేశ్వరస్వామికి అభిషేకాలు



యార్లగడ్డ పుట్టలో పాలుపోస్తున్న భక్తులు



పెదకళ్లేపల్లి దుర్గా నాగేశ్వరస్వామి ఆలయంలో జగాజ్యోతి వెలిగిస్తున్న యార్లగడ్డ శివరామప్రసాద్

భక్తుల పుణ్యస్నానాలు..శివ దర్శనం

మచిలీపట్నం టౌన్, మార్చి 8 : మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం నాగులేటి వద్ద వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు చేశారు. నీరు తక్కువగా ఉండటం వల్ల నగర పాలక సంస్థ జల్లు స్నానాలు ఏర్పాటు చేసింది. నగర కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు ఏర్పాట్లను పరిశీలించారు. సంప్రదాయ సిద్ధంగా పితృదేవతలకు తర్పణాలు, పిండ ప్రదానాలు చేశారు. సువాసినులకు చాటల వాయనాలు ఇచ్చారు. జంగమ దేవరలు శంఖం పూరించి పరమ శివునికి అర్చనలు చేశారు. రసలింగేశ్వరస్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు కొల్లు నీలిమ, జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ప్రసాదం పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. మానవత తదితర స్వచ్ఛంద సంస్థలు మ జ్జిగ, మంచినీరు పంపిణీ చేశాయి. మైత్రీ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ విపో లిక వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

శైవక్షేత్రాలు కిటకిట

మచిలీపట్నం టౌన్ : మహాశివరాత్రి సందర్భంగా ప్రధాన శివాలయాల్లో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్షబిల్వార్చనలు జరిగాయి. రాబర్ట్సన్‌పేట రామలింగేశ్వర స్వామి దేవాలయంలో నిలువెత్తు పరమశివునికి భక్తులు మంగళహారతులిచ్చారు. నాగేశ్వర స్వామిని వేలాది భక్తులు సందర్శించుకున్నారు. గొడుగుపేట శాంతామల్లేశ్వర స్వామి, శంకరమఠంలో స్వామి వారికి మహన్యాస పూర్వక అభిషేకాలు నిర్వహించారు. బచ్చుపేట భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వా మిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. సర్కిల్‌పేట మల్లికార్జున స్వామి, కరగ్రహారం శివాలయం, చింతగుంటపాలెం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పెడన : గంగా పార్వ తీ సమేత అగస్త్యేశ్వర స్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు అగస్త్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకుడు గూడూరు అగస్తయ్య ఆధ్వర్యంల స్వామి వార్ల కళాణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. అన్నసమారాధన జరిగింది. ఆలయ ఈవో టి.వి.వి. మోహనరావు, అభివృద్ధి కమిటీ చైర్మన్ పేరిశెట్టి ఓంకారం, సభ్యులు వీర్నాల మాధవ, మల్లంపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. పోలవరపుపేట, బ్రహ్మపురం తదితర ప్రాంతాలలో ని శివాలయాల వద్ద అన్నసమారాధనలు జరిగాయి.

పెడన రూరల్ : మండలంలోని శివాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. చెన్నూరు గంగా పార్వతి సమేత నారదలింగేశ్వరస్వామి, ఉప్పలకలవగుంట నాగేశ్వరస్వామి, మడక భోగలింగేశ్వరస్వామి, పుల్లపాడు అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, లంకలకలవ గుంట, కూడూరు, నడూపూరు, బల్లిపర్రు, ఉరిమి శివాలయాలలో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. అన్న సమారాధనలు జరిగాయి. **గుడివాడ :** గుడివాడలో మహాశివరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బంటుమిల్లి రోడ్డు భీమేశ్వరస్వామి, గౌరీశంకరపురం చిన్నశివాలయం, బేతవోలు ఆనందేశ్వరస్వామి, బైపాస్ రోడ్డుఉమానాగలింగేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. **గుడ్లవల్లేరు :** శివనామ స్మరణ శివాలయాలు మార్మోగాయి. గుడ్లవల్లేరు సిద్ధేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. లక్ష రుద్రాక్షల శివలింగానికి భక్తులే స్వయంగా అభిషేకాలు చేసుకొనే ఏర్పాటు చేశారు. కౌతవరం గౌతమేశ్వరాలయంలో, విన్నకోట సిద్ధేశ్వరా లయం, డోకిపర్రు, అంగలూరు, వడ్లమన్నాడు శివాలయాల్లో కూడా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. **పామర్రు :** పామర్రు సోమేశ్వర స్వామి (శివాలయం), కాపవరం కపిలేర్దేశ్వరస్వామి, ప్రాకెర్ల రామలింగేశ్వరస్వామి, కొండిపర్రు మల్లికార్జున స్వామి, రాపర్ల సోమేశ్వరస్వామి, ఎలకుర్రు చెన్నమల్లికేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పామర్రు శివాలయంలో రాత్రి శివ కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా ఆలయాధికారి వెంకటరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. ఐలూరు రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు పామర్రు నాలుగు రోడ్ల కూడలినుంచి ఆర్టీసి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో భక్తులు విశేష సంఖ్యలో తరలివెళ్లారు.



నాగులేటి వద్ద భక్తుల సేవలో టీడీపీ, జనసేన నాయకులు



పిట్టలంకలో జనసేన ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



యార్లగడ్డలో జనసేన నేత మాదివాడ మజ్జిగ పంపిణీ

దివిసీమకు పోటెత్తిన భక్తులు

అవనిగడ్డ రూరల్ : పాత ఎడ్లంక బాలకోటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. పితృదేవతలకు పిండ ప్రదానం చేశారు. వేకనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును నిర్వహించారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు ఎలీజా ఆధ్వర్యంలో భక్తులకు భోజన సౌకర్యాన్ని కల్పించారు. ఫిషరీష్ శాఖ ఆధ్వర్యంలో కృష్ణానది ఒడ్డున అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంది. **అవనిగడ్డ :** అవనిగడ్డ రాజశేఖరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఐదు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. **కోడూరు :** కోడూరు శివాలయం, లింగారెడ్డిపాలెం గోకర్ణేశ్వరస్వా మి, ఉల్లిపాలెం శివాలయం వద్ద వేకువ జాము నుంచి భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి వెళ్తున్న భక్తులకు పిట్టలంక గ్రామంలో శుక్రవారం జనసేన పార్టీ నేతలు మజ్జిగ పంపిణీ చేశారు. జనసే నాయకులు మాదివాడ వెంకట కృష్ణ, రాయపూడి వేణుగోపాలరావు, మర్రే గంగయ్య, కొండవీటి సునీత, పిట్టలంక సర్పంచ్ కనగాల వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.



మహిళా అర్చకులు విజయలక్ష్మి - మాధవీలతను సన్మానిస్తున్న గొర్రెపాటి

మహిళా అర్చకులకు సత్కారం

ఘంటసాల : ఘంటసాల అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామివారి దేవాలయంలో శుక్రవారం మహిళా అర్చకురాలు ఘంటసాల విజయలక్ష్మి స్వా మివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 43 సంవత్సరాలుగా విశ్వేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఘంటసాల విజయలక్ష్మి, ఆమె సోదరి ఘంటసాల మాధవీలతలను జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ గ్రామస్థులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఘంటసాల వెంకటేశ్వరరావు కుటుంబీకులైన వీరిరువురూ స్వామివారి సేవలో తరించటం పూర్వజన్మ సుకృతమన్నారు. జి.సత్యవర్ధన, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా జగాజ్యోతి

మోపిదేవి : పెదకళ్లేపల్లిలో స్వయంభువుగా కొలువై ఉన్న దుర్గానాగేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జగాజ్యోతి కార్యక్రమం శుక్రవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. ప్రధాన అర్చకులు బుద్దు వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చల్లపల్లి రాజా వంశీయులు శ్రీమంతు యార్లగడ్డ శివరామప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ చల్లపల్లి రాజా వంశీయులు జగాజ్యోతిని వెలిగించి, స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు ఆధ్వర్యంలో ఎస్టేట్ దేవాలయాల ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు. అవనిగడ్డ డిఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో సీఐ నాగ ప్రసాద్ భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

యార్లగడ్డ పుట్టతీర్థానికి...

చల్లపల్లి : యార్లగడ్డ పుట్టతీర్థానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. పశు పోషకులు పశువులను ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. చభక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి నాగపుట్టలో పాలుపోసి, స్వామివారిని..అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయకమిటీ చైర్మన్, సర్పంచ్ యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్, ఆలయ కమిటీ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు. చల్లపల్లిఅన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, లక్ష్మీపురం సోమేశ్వర స్వామి, పాగోలు పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. యార్లగడ్డలో జనసేన ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మజ్జిగను పంపిణీ చేశారు. మండల జనసేన అధ్యక్షుడు చోడగం విమల్‌కృష్ణ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేయగా, జనసేన నియోజకవర్గ నాయకులు మాదివాడ వెంకట కృష్ణ(క్రిస్టియన్) ముఖ్య అతిథిగా పాల్గొని మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, మోపిదేవి అధ్యక్షుడు రత్నగోపాల్ పాల్గొన్నారు.

వైభవంగా సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

నాగాయలంక : సంగమేశ్వరం గంగా పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా స్వామివారిని దర్శించుకొనేందుకు భక్తులు బారులు తీరారు. ఈవో సిహెచ్.సుధాకర్‌రావు భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణంలో దాతల విరాళాలతో భారీ అన్నసంతర్పణ జరిగింది. కమిటీ చైర్మన్ వల్లభని వసంతరావు పర్యవేక్షించారు. పోలీ సు, రెవెన్యూ సిబ్బంది విశేష సేవలందించారు. భాగస్వామి అ య్యారు. నాగాయలంక శ్రీరామ పాదక్షేత్రంలోని రామలింగేశ్వరస్వామి, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు,అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు.

వివిధ రంగాల మహిళలకు సత్కారం



అవనిగడ్డలో వీర మహిళలకు సత్కారం



డాక్టర్ మాధవీలతకు సత్కారం



వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో మహిళలకు సత్కారం



చల్లపల్లిలో మహిళా దినోత్సవం

మచిలీపట్నం టౌన్, మార్చి 8 : ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షురాలు చల్లపల్లి విజయ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు వి. రాధిక, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అన్నారు. బాలికల విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్టీసీ డీఎం పెద్దిరాజులు అన్నారు. మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోబుల్ కాలనీ ఎవిలియన్ గరల్స్ హోమ్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్టీసీ డీఎం పెద్దిరాజులు మాట్లాడుతూ, మైత్రి ఫౌండేషన్ సేవలు ముదావహమన్నారు. వేణు కుమార్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ :** టీడీపీ ప్రజావేదికలో నియోజవకర్గ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ మరీదు విజయలక్ష్మి, ఆశా వర్కర్ షేక్ ఆశ, బ్యాంకు స్వీపర్ కస్తూరి నీలమ్మ, విశ్రాంత ఉపాధ్యాయురాలు పొట్లూరి రమాదేవిలను ఘనంగా సత్కరించారు. రావి వెంకటేశ్వరరావు, బాబ్జీ, యలవర్తి, సుధారాణి పాల్గొన్నారు. ఎస్టీ యూ ఆధ్వర్యంలో పానకాల సుధారాణి, కె.పద్మజాకుమారి, బి.వి రమాదేవి, సుచరిత, సబితలను ఘనంగా సత్కరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు ఆధ్వర్యంలో పిరమిడ్ ధ్యాన కేంద్ర నిర్వాహకులు రాజకుమారిని ఘనంగా సత్కరించారు. కేటీఆర్ కళాశాలలో శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ఎం.గాయత్రి, ఏజీకే పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు ఎం.లక్ష్మీ, ఉపాధ్యాయురాలు విజయలక్ష్మీలను ఘనంగా సత్కరించారు. **అవనిగడ్డ :** తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆస్తిలో సమాన హక్కు కల్పించట మే కాకుండా సమాజంలో మహిళలకు గౌరవం పెరిగేలా ఎన్టీఆర్ చర్యలు తీసుకున్నారన్నారు. నాగ వెంకట కనకదుర్గ, కృష్ణకుమారి, మోర్ల జయలక్ష్మి, దీవి యుగంధరి పాల్గొన్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వీర మహిళలను ఘనంగా సన్మానించారు. **చల్లపల్లి :** పాగోలు ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు సందేశమిచ్చారు. కృష్ణకుమారిని ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పెడన :** దేవాంగ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మునిసిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ మెట్ల శైలశ్రీలకు ఘన సన్మానం జరిగింది. **గుడ్లవల్లేరు :** లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో ఆశాజ్యోతి దివ్యాంగుల ఆశ్రమ నిర్వాహకులు, పశ్చిమగోదావరి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ మరీదు మాధవీలతను ఘనంగా సన్మానించారు.

సెర్వికల్ కేన్సర్‌పై మహిళలకు అవగాహన ఉండాలి

గుడివాడ : సెర్వికల్ కేన్సర్‌పై మహిళల్లో అవగాహన అవసరమని పెలికాన్ హాస్పటల్ వ్యవస్థాపకులు, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ యలమంచిలి రోజా అన్నారు. వీకేఆర్ అండ్ వీఎన్‌బి ఇంజినీరింగ్ కళాశాలలో డెకథ్లాన్ సౌజన్యంతో అంతర్జాతీయ మహిళ దినత్సోవం సందర్భంగా కేన్సర్‌పై అవగాహన కల్పించారు ప్రొఫెసర్ కోడూరి జానకీదేవి మాట్లాడుతూ మహిళలు మరింత చైతన్యవంతులు కావాలన్నారు. విజేతలకు కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండ రామయ్య, డైరెక్టర్ బి.కళ్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డా.ఎస్.హెచ్.వి ప్రసాదరావు బహుమతులు అందజేశారు. ప్రముఖ వైద్యులు డాక్టర్‌యలమంచిలి రోజా, బోళ్ల రమ, డాక్టర్ వేములపల్లి మృదుల, డాక్టర్‌హనుమార నాగరత్నలను ఘనంగా సత్కరించారు.

ముందస్తు వ్యాక్సిన్‌తో కేన్సర్ నివారణ

చల్లపల్లి : మహిళల్లో వచ్చే కేన్సర్‌ను ముందస్తు వ్యాక్సిన్‌తో నివారించవచ్చని విజయవాడ మిత్ర ఆసుపత్రి డాక్టర్ అనూష తెలిపారు. మహిళా దినోత్సవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వక్కలగడ్డ కమలానెహ్రూ మహిళా మండలి ఆవరణలో మహిళా దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ అనూష మహిళల్లో వచ్చే కేన్సర్‌పై అవగాహన కల్పించారు. మహిళాసమాఖ్య జిల్లా అధ్యక్షురాలు మల్లుపెద్ది రత్నకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వల్లూరు ఉమా, ఉపసర్పంచ్ హేమలత, మహిళా మండలి అధ్యక్ష కార్యదర్శులు హనుమానుల రాణీకుమారి, మైనేని కమల, సొసైటీ చైర్‌పర్సన్ హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత వైద్యశిబిరం



చల్లపల్లి : కీర్తి హాస్పటల్ వైద్యురాలు డాక్టర్ నల్లపనేని కీర్తి శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఏటా మహిళా దినోత్సవం రోజున కీర్తి ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. క్యాన్సర్ సంబంధిత పరీక్షలు ఉచితంగా చేశారు.



పుట్టగుంటలో వెనిగండ్ల ప్రచారం

నందివాడ (పుట్టగుంట) : ఎమ్మెల్యే కొడాలి నానికి 2024 ఎన్నికలే చివరివి అని వెనిగండ్ల రాము అన్నా రు. పుట్టగుంటలో శుక్రవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో వెనిగండ్ల రాము పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, పిన్నమనేని వెంకటేశ్వరరావు, పిన్నమనేని బాబ్జీ, జనసేన గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. దానేటి సన్యాసిరావు, రాజేశ్వరరావు, మద్దాల ఇస్సాకు, ప్రదీప్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ముస్లింలు అండగా నిలవాలి : కాగిత

పెడన : ముస్లింల సంక్షేమానికి టీడీపీ పెద్ద పీట వేసిందని పెడన నియోజకవర్గ టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. టీడీపీ ముస్లిం మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన పట్టణంలోని ముస్లిం ప్రముఖులను కలిసి తనకు మద్దతుగా నిలిచి విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణప్రసాద్ వెంట అబ్దుల్ ఖయూం (హన్ను), అబ్దుల్ ఖదీర్, రహమాన్ బేగ్, వహబ్‌ఖాన్, హమీదుల్లా, గఫార్, బాబులు, వాహెద్ తదితరులు ఉన్నారు.